www.aksharamedassu.com

APTEL/26/A8343

తెలుగుపత్రిక

అక్షర మేధస్సు

అక్షరమే ఆయుధం మేధస్సే మా మార్గం

ప్రచురణ : అనంతపురం సత్యసాయి | ఎడిటర్ : యన్ రంగనాథ్ | సంపుటి : 01 | సంచిక : 35 | పేజీలు : 04 | బుధవారం 25 - 11 - 2026 | వెల : 01/-



మహిళలకు రేవంత్ సర్కార్ కోటి మంది

మహిళలకు కోటి చీరలు

- నవంబర్ 26న అచ్చంపేటలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ
- గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల మంది మహిళలకు లబ్ధి
- తెలంగాణ చేనేత కార్మికులతోనే చీరల తయారీ
- ఆకర్షణీయమైన చిలుకపచ్చ రంగులో ప్రత్యేక డిజైన్
- రేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన మహిళలకు అర్హత



హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వం కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనుంది. ఈ నెల 26వ తేదీన అచ్చంపేటలో పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.తెలంగాణ ప్రభుత్వం కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనుంది. ఈ నెల 26వ తేదీన అచ్చంపేటలో పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చీరల పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షలు.. పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. ఆకర్షణీయమైన చిలుకపచ్చ రంగులో ప్రత్యేకంగా చీరలను కాంగ్రెస్ సర్కార్ తయారీ చేసింది.95 లక్షల పాలిస్టర్.. 5 లక్షల పాలీకాటన్ చీరలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనుంది. తెలంగాణలోని నేత కార్మికులతోనే ఈ చీరలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తయారీ చేసింది. ఇందుకోసం రేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన మహిళలను అర్హులుగా ప్రకటించింది. ఆధార్, ఆహార భద్రత కార్డు వివరాలతో ఈ చీరలను పంపిణీ చేయనుంది. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేయనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రుల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టనుంది.

నేటి నుంచి హైదరాబాద్‌లో

కిషన్ రెడ్డి భారీ పాదయాత్ర



- హైదరాబాద్‌లో నేటి నుంచి మూడు రోజుల పాటు 'నషా ముక్త భారత్' పాదయాత్ర
- అంబర్‌పేట్ నుంచి జూబ్లీహిల్స్ వరకు 30 కిలోమీటర్ల మేర సాగనున్న ప్రచార ర్యాలీ
- డ్రగ్స్ బారినపడి యువత భవిష్యత్తు నాశనం కావద్దన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ :

దేశ యువతను పెనుభూతంలా వేధిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్ర - మిగతా 2 లో



తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా

గ్లోబల్ సమ్మిట్

- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు
- భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన శ్రీధర్ బాబు
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026
- సమ్మిట్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం

హైదరాబాద్ :

హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో త్వరలో జరగనున్న - మిగతా 2 లో

యువత మత్తు పదార్థాలకు

దూరంగా ఉండాలి



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- దేశ యువత ఎలాంటి వ్యసనాలకు లోనుకాకూడదని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు
- యువత మాదకద్రవ్యాల బారిన పడితే, వారి కుటుంబాల కలలు ఛిద్రమవుతాయని పేర్కొన్నారు

ఢిల్లీ :

దేశ యువత ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండామత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. సిక్కుల మొదటి గురువు శ్రీ గురు నానక్ దేవ్ జయంతి సందర్భంగా దిల్లీలోని లోక్ నివాస్‌లో జరిగిన 'శబద్ కీర్తన' కార్యక్రమంలో ప్రధాని సోమవారం పాల్గొన్నారు. దేశం కోసం, సంస్కృతి కోసం సర్వస్వం త్యాగం చేసే స్ఫూర్తికి యావత్ సిక్కు - మిగతా 2 లో

గోదావరి పుష్కరాలు-2027 లోగో, ట్యాగ్‌లైన్ పోటీలు

- మొదటి బహుమతి విజేతకు రూ.1 లక్ష నగదు పురస్కారం
- రెండు, మూడు బహుమతులకు రూ.50 వేలు, రూ.25 వేలు
- ఎంట్రీలు పంపేందుకు నవంబర్ 30 వరకు గడువు
- ప్లాస్టిక్ రహితంగా పుష్కరాల నిర్వహణకు ప్రణాళికలు

హైదరాబాద్ :

గోదావరి పుష్కరాలు-2027ను కుంభమేళా స్థాయిలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా పుష్కరాల విశిష్టతను చాటే అధికారిక లోగో.. ఆకర్షణీయమైన ట్యాగ్‌లైన్ రూపకల్పన కోసం ప్రత్యేక పోటీలను ప్రకటించింది. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏ విశ్వవిద్యాలయంలో - మిగతా 2 లో



ఆస్తులు తీసుకొని తల్లిదండ్రులను

రోడ్డున పడేస్తే మూడేళ్ల జైలు



- కేరళం సీఎం సంచలన నిర్ణయం
- అసెంబ్లీలో నూతన చట్టం ఆమోదించిన కేరళం ప్రభుత్వం
- వృద్ధుల కోసం ప్రత్యేక శాఖను తెచ్చిన తొలి రాష్ట్రంగా కేరళం
- గవర్నర్ ఆమోదం రాగానే నిబంధనలు పక్కాగా అమలు
- పతనపురంలో రూ.20 కోట్లతో వృద్ధుల కోసం 'పితృమందిరం'
- భవన నిర్మాణానికి నిధులు అందించిన లులు గ్రూప్ అధినేత

కేరళ :

తల్లిదండ్రుల నుంచి ఆస్తులు రాయించుకుని, ఆ తర్వాత వారిని పట్టించుకోకుండా గాలికొదిలేసే పిల్లలకు కేరళం ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. అలాంటి బాధ్యతారహిత సంతానానికి - మిగతా 2 లో

చేతులకు బేడీలు వేసి తీసుకొస్తాం

- షేక్ హసీనాకు బంగ్లాదేశ్ తీవ్ర హెచ్చరిక
- విమానం పంపాలన్న హసీనా డిమాండ్ పిచ్చితనమన్న ప్రాసిక్యూటర్
- హసీనా అప్పగింతపై భారత్‌తోనే చర్చిస్తామన్న బంగ్లా ప్రధాని సలహాదారు
- డిసెంబర్ 16న తిరిగొచ్చేందుకు హసీనా పట్టుతో సరిహద్దుల్లో ఉద్రిక్తత



సముద్రంలో ఉప్పాడ

మత్స్యకారులు గల్లంతు



- బంగ్లాదేశ్, మయన్మార్‌లకు సమాచారం
- కాకినాడ జిల్లా ఉప్పాడ సుబ్బంపేట మత్స్యకారులు సముద్రంలో గల్లంతయ్యారు
- పది రోజులుగా ఆచూకీ లేకపోవడంతో నేవీ, కోస్ట్‌గార్డ్ సమన్వయంతో గాలింపు ముమ్మరం చేశారు
- ఈ నెల 11న సముద్రంలో వేటకు వెళ్లిన సుబ్బంపేట వాసులు
- నవంబర్ 14 తర్వాత కుటుంబ సభ్యులతో తెగిపోయిన ఫోన్ సంబంధాలు
- గత 10 రోజులుగా ఆచూకీ లేకపోవడంతో కుటుంబాల్లో తీవ్ర ఆందోళన

కాకినాడ :

కాకినాడ జిల్లాలో మత్స్యకారుల గల్లంతు ఘటన ఆందోళన కలిగిస్తోంది. ఉప్పాడ సమీపంలోని సుబ్బంపేటకు చెందిన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతయ్యారు. గత పది రోజులుగా వారి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాధిత మత్స్యకారుల ఆచూకీని గుర్తించేందుకు ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగింది. సముద్రంలో గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.ఉప్పాడ - మిగతా 2 లో

బంగాళాఖాతంలో

ద్రోణి ప్రభావం

- ఏపీలో నేడు కూడా వర్షాలు
- ఏపీలో రానున్న నాలుగు రోజులు వర్షాలు
- పిడుగులు పడే అవకాశం ఉండటంతో అధికారుల హెచ్చరిక
- ఉరుముల సమయంలో చెట్ల కింద ఉండవద్దని సూచన

అమరావతి :

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ - మిగతా 2 లో

శాంతిభద్రతలకే మొదటి ప్రాధాన్యత

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- పలు ప్రాంతాల్లో అదనపు బలగాలు
- పంచాయితీ ఎన్నికలకు ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో ఎస్ఈసీ పునేఠా సమీక్ష
- ఏకగ్రీవాల కారణంగా బలగాలు అదనంగా ఉంటాయన్న ఎస్ఈసీ పునేఠా



అమరావతి :

పంచాయతీ ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణ తమ మొదటి ప్రాధాన్యత అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలలో అదనపు బలగాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు దశల గ్రామపంచాయితీ ఎన్నికలకు ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో ఎస్ఈసీ సమీక్ష నిర్వహించారు. ఏకగ్రీవాల కారణంగా బలగాలు అదనంగా ఉంటాయని చెప్పారు. డీజీపీ కార్యాలయం నుంచి సైతం బలగాలు వస్తాయని తెలిపారు. పలు జిల్లాల్లో సమస్యలు ఎక్కువ ఉన్నాయని అలాంటి సమస్యాత్మక ప్రాంతాలలో అదనపు బలగాలు ఉంటాయని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో ఏకగ్రీవాలు 15 నుంచి 20 శాతం జరుగుతాయని అనుకుంటే 19 శాతం వరకూ జరిగిందని ఎస్ఈసీ చెప్పారు. గుంటూరు జిల్లాలో ఒక అభ్యర్థిని నాలుగు సార్లు అడ్డుకున్నారని స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి ఫిర్యాదు డీజీపీకి పంపించామని చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఎక్కడా బలవంతంగా ఏకగ్రీవాలు జరగకూడదని చెప్పామని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.తొలి దశలో 3949 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు - మిగతా 2 లో

సంపాదకీయం

దోపిడీ రూపం మారింది.. సారంలో కాదు!

డిజిటల్ భూస్వాములు.. క్లౌడ్ పాలేర్లు!' శీర్షికతో నవంబర్ 10న ఎం.కె.కుమార్ రాసిన వ్యాసంలో ఆయన చెప్పిన విషయాలు భూస్వాములకూ, పాలేర్లకూ సంబంధించినవి కావు. ఆన్లైన్‌లో వర్తకం చేసే పెట్టుబడిదారులను 'డిజిటల్ భూస్వాములు' అనీ, వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనీ ఒక సంస్కరణవాద ఆర్థికవేత్త ప్రతిపాదించిన పదాలను పొరపాటుగా ఉపయోగించారు. అందువల్లనే, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' అని, 'అస్థిరమైన కొత్త కార్మికవర్గం ఆవిర్భవించింది' అనీ కొన్ని పొరపాటు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.ఏ వస్తువు కొనాలి? అన్న స్వేచ్ఛ కొనుగోలుదారులకు గతంలో ఉండేదనీ, ఆన్లైన్ వ్యాపారం వచ్చాక ఆ స్వేచ్ఛపోయిందన్నారు వ్యాసకర్త. అది కరెక్టు కాదు. అప్పుడైనా ఇప్పుడైనా ఏ వస్తువు కొనాలనే స్వేచ్ఛ కొనుగోలుదారులకు లేదు. పెట్టుబడిదారులు ఏ సరుకులు తయారు చేయిస్తారో, ఏ సరుకుల గురించి ప్రకటనలు విరివిగా ఇస్తారో, దానికి లోబడే కొనుగోళ్లు జరుగుతాయి. కాకపోతే, అప్పుడు షాపులకు వెళ్లి కొనుక్కోవడం ఉండేది, ఇప్పుడు ఆన్లైన్‌లో కొనుక్కునే పద్ధతి కూడా వచ్చింది.'ఇప్పుడున్నది సంప్రదాయ పెట్టుబడి కాదు, అది క్లౌడ్ క్యాపిటల్' అన్నారు వ్యాసకర్త. ఈ 'క్లౌడ్ క్యాపిటల్' అనేది, సరుకుల్ని తయారు చేయించడానికి పెట్టే 'పారిశ్రామిక' పెట్టుబడి కాదు. 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్సు ప్రస్తావించిన 'వర్తక పెట్టుబడి' తప్ప, వేరుకాదు. వర్తక లావాదేవీలు షాపుల్లో జరుగుతున్నాయా, ఆన్లైన్‌లో జరుగుతున్నాయా అన్నదే తేడా. కుమార్ ప్రస్తావించిన కంపెనీలన్నీ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలే. ఆన్లైన్‌లో వర్తకం చేసే కంపెనీల యజమానుల్ని 'డిజిటల్ భూస్వాములు' అనకూడదు. 'డిజిటల్ వర్తక పెట్టుబడిదారులు' అనాలి. ఆ కంపెనీలు 30--40శాతం కమీషన్ లాక్కుంటాయన్నారు. అవును మరి, పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో అది సహజం. సరుకులు తయారు చేయించిన పారిశ్రామిక పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని తామే అమ్ముకునే ఏర్పాటు లేనప్పుడు, ఆ సరుకుల్ని అమ్మిపెట్టమని వర్తక పెట్టుబడిదారులకు ఇస్తారు. ఆ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలు ఆ సరుకుల్ని వాటి పూర్తి విలువలకే అమ్మి, అలా అమ్మినందుకు కమీషన్ మినహాయించుకుని, మిగతాది సరుకు యజమానులకు ఇస్తాయి. ఇది పెట్టుబడిదారీ విధానం పుట్టినప్పటినించీ ఉన్నదే. తేడా ఏమంటే ఆన్లైన్ అనే కొత్త రూపమే. ఇంకా, వర్తక కమీషన్ అనేది 'మధ్యయుగాల నాటి భూస్వామి రైతుల నుంచి వసూలు చేసే శిస్తు' లాంటిదే' అని కుమార్ పొరపాటుపడ్డారు. ఏ శ్రమా చేయకుండా కౌలురైతుల నుంచి భూస్వామి లాగేది 'శిస్తు' కాదు. భూమి కౌలు. భూమి యజమాని ప్రభుత్వానికి చెల్లించే దానిని 'శిస్తు' అంటారు. అమెజాన్ వంటి ఆన్లైన్ వర్తక కంపెనీలకు చిన్న స్థాయి సరుకు పెట్టుబడిదారులు చెల్లించేది సామంతులు చెల్లించే కప్పం లాంటిది అని కుమార్ చాలా పొరపాటుగా పోల్చారు. అది 'వర్తక కమీషన్'.కుమార్ తెచ్చిన ఇంకో పెద్ద తప్పు పోలిక ఏమిటంటే, కోట్లాదిమంది వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనడం. ఇంటర్నెట్ ముందు ఎన్ని వేల గంటలు గడిపినా, ఎన్ని వేల వీడియోలు చూసినా, ఏ సరుకూ తయారుకాదు. సరుకు తయారీకి కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొంత శ్రమా కావాలి. వినియోగదారులు ఏ సాధనాలతో, ఏ శ్రమ చేసి, ఏ సరుకును తయారుచేస్తున్నట్టు? ఇలా భావించడం అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించి, మార్క్సు చెప్పినదానిని సరిగా గ్రహించలేదని అర్థం.పెట్టుబడిదారుల రాబడి రేటు పెరగడాన్ని అర్థం చేసుకోవడానికి, కుమార్ ఇచ్చిన ఉదాహరణ పూర్తిగా తప్పు. ఒక కంపెనీ యజమానికి, స్టాక్ మార్కెట్లో తన కంపెనీ షేర్ల విలువ పెరగడం వల్ల వచ్చిన డబ్బు తన దగ్గర పనిచేసే కార్మికుల నుంచి సంపాదించిన అదనపు విలువ కాదు. అది షేర్లు కొన్నవారి డబ్బు. దానిని మార్క్సు 'కల్పిత పెట్టుబడి' అన్నాడు. ఆ కంపెనీ యజమాని, ఆ కల్పిత పెట్టుబడిని, కొత్త ఉత్పత్తి కార్యంలో పెడితే, దాని ద్వారా కొత్త అదనపు విలువను సంపాదించవచ్చును. అది వేరే సంగతి. "ఇంతటి బహిరంగ దోపిడీ జరుగుతున్నప్పుడు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?" అని ఒక అమాయకపు ప్రశ్న వేశారు కుమార్. జవాబు చాలా సింపుల్. ఇవి పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను రక్షించే ప్రభుత్వాలు గనక! ఒక ఆర్థికవేత్త చేసిన విశ్లేషణను ప్రస్తావించి, 'నేటి సమాజంలో కొత్త వర్గం పుట్టుకొచ్చిందని' కుమార్ అమాయకంగా చెపుతున్నారు. ఉద్యోగ భద్రత లేని స్థితి వల్ల నిరంతరం ఏర్పడుతున్న నిరుద్యోగుల్నీ, పార్టు టైం ఉద్యోగుల్నీ, ఇంకా అలాంటివారిని ఉదాహరణలుగా చూపారు. ఇది 'కొత్త వర్గం' కానేకాదు. పెట్టుబడిదారీ విధానం ఎప్పటికప్పుడు, కార్మికులలో ఒక భాగాన్ని నిరుద్యోగంలోనో, చిరుద్యోగంలోనో ఉంచుతుందనీ, వారిని 'అదనపు జనాభా'గా పెట్టుబడిదారులు భావిస్తారనీ మార్క్సు ఏనాడో చెప్పాడు. వాళ్లకే, ఈనాటి కొత్త ఆర్థికవేత్తలు కొత్త పేర్లు పెడతారు. వ్యాసకర్త భావిస్తున్నట్టు, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' కాదు. దాని రూపమే మారింది తప్ప, సారం ఏమీ మారలేదు. దాన్ని సమూలంగా మార్చడానికి, మార్క్సు చూపిన మార్గాన్ని మించి, "కొత్త తరహా పోరాటమార్గం" ఏదీ లేదు.

సముద్రంలో ఉప్పాడ మత్స్యకారులు గల్లంతు



మొదటిపేజీ తరువాయి - సుబ్బంపేటకు చెందిన ఆరుగురు మత్స్యకారులు ఈ నెల 4న చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లారు. ఈ నెల 14వ తేదీ వరకు వారు ఫోన్ ద్వారా తమ కుటుంబసభ్యులకు అందుబాటులోనే ఉన్నారు. అయితే ఆ తర్వాత నుంచి వారితో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు అంటే గత పది రోజులుగా వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో మత్స్యకార కుటుంబాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటు ఒడిశాలోని పారాదీప్ తీరానికి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో అదృశ్యమైనట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఇటీవల సంభవించిన తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈ క్రమంలో గాలులు, అలల ధాటికి బోటు దారి తప్పి ఇతర దేశాల సముద్ర జలాల్లోకి కొట్టుకుపోయి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంలోనే అధికారులు తక్షణమే అప్రమత్తమయ్యారు. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, మయన్మార్ అధికారులకు కూడా గల్లంతైన మత్స్యకారుల వివరాలతో సమాచారం పంపించారు.మత్స్యకారుల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించేందుకు భారీ స్థాయిలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. భారత నౌకాదళం (నేవీ), కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కాకినాడ, పారాదీప్ కోస్ట్‌గార్డ్ బృందాలతో పాటు చెన్నైలోని ఎంఆర్‌సీసీ సమన్వయంతో సముద్రంలో ముమ్మరంగా గాలింపు నిర్వహిస్తున్నాయి.మత్స్యకారుల ఆచూకీ తెలియక కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ఓ సానుకూల అంశం కాస్త ఊరటనిస్తోంది. వేటకు వెళ్లిన సమయంలో బోటులో 1,500 లీటర్ల డీజిల్ నిల్వ ఉందని కుటుంబసభ్యులు వెల్లడించారు. అంతేకాకుండా వారికి 30 రోజులకు సరిపడా ఆహార నిల్వలు కూడా ఉన్నాయని తెలిపారు. దీంతో వారు సముద్రంలో ఎక్కడ ఉన్నా సురక్షితంగానే ఉంటారన్న నమ్మకం బలపడుతోంది. గల్లంతైన మత్స్యకారులు కచ్చితంగా క్షేమంగా తిరిగి వస్తారన్న ఆశాభావాన్ని మంత్రి అచ్చెన్నాయుడు వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం

మొదటిపేజీ తరువాయి - వెల్లడించింది. వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏపీలో ఇవాళ పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో రోడ్లపై మోకాలి లోతున నీరు నిలిచింది. నెల్లూరులోనూ వర్షపాతం నమోదైంది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం, నైరుతి బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు తూర్పు గాలుల ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే వీలుంది. వీటితో పాటు మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడ చెదురుమదురు జల్లులు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పుల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు ఎవరూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండవద్దని స్పష్టం చేసింది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు వర్షం పడే సమయంలో సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని విజ్ఞప్తి చేసింది. అత్యవసరమైతే తప్ప వర్షం, పిడుగుల సమయంలో బయటకు రావద్దని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, అధికారులు ఎప్పటికప్పుడు తాజా వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి - సంప్రదాయం మారుపేరుగా నిలిచిందని ప్రధాని కొనియాడారు. దేశం వందల ఏళ్లు వలసవాద పాలనలో కష్టాలు ఎదుర్కొన్నప్పుడు, దేశ రక్షణ అనే జ్యోతిని మన గురువులు ఆరిపోకుండా సజీవంగా ఉంచారని చెప్పారు. ఇప్పుడు వికసిత్ భారత్ లక్ష్యాన్ని కూడా మన గురువుల స్ఫూర్తి, వారి ఆదర్శాలతో చేరుకోగలమని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు."నేడు మన సమాజంలో డ్రగ్స్ అనేది ఒక సవాలు ఉంది. దేశంలోని యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి. దేశంలోని ప్రతి యువకుడు మత్తు నుంచి విముక్తి పొందాలి. వారు తమ కలలను సాకారం చేసుకోవాలి. కష్టపడి చదువుకుని, ముందుకు సాగాలి. తమ కుటుంబాలకు, దేశానికి గర్వకారణంగా నిలవాలి. ఈ ప్రయత్నంలో కుటుంబాలకు చాలా కీలక పాత్ర ఉంది. యువత మాదకద్రవ్యాల బారిన పడితే, అతడి జీవితంతోపాటు తమ కుటుంబాల కలలు ఛిద్రమవుతాయి. మన సమాజం, మన గురుద్వారాలు, మన సామాజిక సంస్థలు అన్నీ కలిసికట్టుగా యువతకు సరైన దిశానిర్దేశం చేయగలవు" అని మోదీ పేర్కొన్నారు.కాగా, 2029 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం సంకల్పించింది. ఈ మేరకు 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' పేరుతో దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ క్రమంలో రానున్న 100 ఆదివారాల్లో పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ రహిత కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈనెల 25, 26, 27 తేదీల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో 'నషాముక్త్ భారత్' ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీలో రాజకీయులకు అతీతంగా నాయకులు, సినీ ప్రముఖులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.ం

గోదావరి పుష్కరాలు-2027 లోగో, ట్యాగ్‌లైన్ పోటీలు

మొదటిపేజీ తరువాయి - మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో పాటు పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో విద్యార్థులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ పోటీల్లో గెలుపొందిన ఉత్తమ డిజైనర్లకు ప్రభుత్వం ఆకర్షణీయమైన నగదు పురస్కారాలను ప్రకటించింది. మొదటి బహుమతి కింద రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు అందజేయనున్నారు. కళాకారులు, విద్యార్థులు, డిజైనర్లతో పాటు సాధారణ ప్రజలు సైతం ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్నవారు తమ ఎంట్రీలను ఈ నెల 30వ తేదీలోపు godavaripushkaralutg@gmail.com అనే ఈమెయిల్‌కు పంపాల్సి ఉంటుంది. తెలంగాణ సంస్కృతి, గోదావరి నది పవిత్రత, ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడేలా లోగో, ట్యాగ్‌లైన్‌లను తీర్చిదిద్దాలని నిపుణులు సూచించారు. ఎంపికైన లోగో, ట్యాగ్‌లైన్‌ను పుష్కరాల ప్రచారంలో అధికారికంగా విస్తృతంగా వినియోగించనున్నారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ పవిత్ర పుష్కరాలకు దేశవిదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలిరానున్నారు. బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం, కోటిలింగాల వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలతో పాటు తీర ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునికీకరణ, విస్తరణ పనులపై ప్రభుత్వం ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టింది. రవాణా, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా సమన్వయం చేస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది.

ఆస్తులు తీసుకొని తల్లిదండ్రులను రోడ్డున పడేస్తే మూడేళ్ల జైలు

మొదటిపేజీ తరువాయి - ఏకంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సంచలన ప్రకటన చేశారు. సీనియర్ సిటిజన్ల సంరక్షణ, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర అసెంబ్లీ అక్టోబర్‌లో ఆమోదించిన నూతన బిల్లులో ఈ కీలక నిబంధనను చేర్చినట్లు స్పష్టం చేశారు. కొల్లం సమీపంలోని పతనపురంలో గల గాంధీభవన్‌లో రూ.20 కోట్ల వ్యయంతో వృద్ధుల కోసం అత్యాధునిక వసతులతో నిర్మించిన 'పితృమందిరం' నివాస సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఈ వివరాలు వెల్లడించారు.యూడీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకున్న తొలి నిర్ణయం వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడమేనని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే ఇలాంటి శాఖను నెలకొల్పిన తొలి రాష్ట్రం కేరళం అని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా వయోవృద్ధులకు పలు విశేష హక్కులను కల్పిస్తూ సమగ్ర చట్టాన్ని తెచ్చామని వివరించారు. గవర్నర్ ఆమోదం లభించి ఈ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి రాగానే, తల్లిదండ్రులను మోసం చేసే పిల్లలను కచ్చితంగా జైలుకు పంపుతామని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదని గట్టిగా చెప్పారు.పిల్లలను పెంచి పెద్ద చేయడానికి తల్లిదండ్రులు ఎంతటి కష్టాలు, త్యాగాలు భరిస్తారో సమాజం తెలుసుకోవాలని సతీశన్ ఉద్వేగంగా మాట్లాడారు. ఎదిగి పెద్ద స్థాయికి చేరిన తర్వాత కన్నవారిని అనాథలుగా వదిలేసే సంస్కృతి కేరళలో ఉండకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను గుండెలకు హత్తుకుని చూసుకునే సరికొత్త సంస్కృతి సమాజంలో రావాలని, రాష్ట్రంలో ఏ ఒక్క వృద్ధుడూ ఒంటరి కాకూడదన్నదే తన ఆశయమని తెలిపారు. కాగా, ఈ పితృమందిరం నిర్మాణానికి పూర్తి ఆర్థిక సాయం అందించిన లులు గ్రూప్ చైర్మన్ ఎం.ఎ.యూసుఫ్ అలీని సీఎం కొనియాడారు. ఎంత సంపద ఉన్నా ఇతరులకు సాయం చేసే గొప్ప గుణం ఆయనకు ఉందని ప్రశంసించారు.

శాంతిభద్రతలకే మొదటి ప్రాధాన్యత

మొదటిపేజీ తరువాయి - నిర్వహిస్తున్నారు. తాజాగా వీటిలో 758 సర్పంచ్ పీఠాలు, 39,832 వార్డుల్లో 14,727 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అత్యధికంగా తిరుపతి జిల్లాలో 135 మంది సర్పంచ్‌లు, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాల్లో ఒక్కొక్కరి చొప్పున సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వార్డుల్లోనూ అత్యధికంగా తిరుపతి జిల్లాలోనే 2131, అత్యల్పంగా తూర్పుగోదావరి జిల్లాలో 45 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వెల్లడించింది. సర్పంచ్ స్థానాల్లో 19.19 శాతం, వార్డుల్లో 36.97 శాతం ఏకగ్రీవమయ్యాయి.

నేటి నుంచి హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి భారీ పాదయాత్ర

మొదటిపేజీ తరువాయి - ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళుతోంది. ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు హైదరాబాద్ నగరంలో నేటి నుంచి మూడు రోజుల పాటు 'నషా ముక్త భారత్' పాదయాత్ర నిర్వహించనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త భారత్' పేరిట చేపట్టే ఈ యాత్ర నేడు అంబర్‌పేట్‌లో ప్రారంభమై, నవంబర్ 27న జూబ్లీహిల్స్‌లో ముగుస్తుంది. సుమారు 30 కిలోమీటర్ల మేర నగరంలోని ప్రముఖ కూడళ్ల మీదుగా ఈ పాదయాత్ర కొనసాగనుంది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 'నషా ముక్త భారత్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం దేశ యువతను వేధిస్తున్న సవాళ్లలో డ్రగ్స్ అతి ప్రధానమైనదని అందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది యువత మత్తుపదార్థాల బారినపడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.డ్రగ్స్ మహమ్మారి కారణంగా పంజాబ్ రాష్ట్రం పూర్తిగా నిర్వీర్యమైపోయిందని, అటువంటి పరిస్థితి ఇతర రాష్ట్రాలకు రాకూడదనే ఉద్దేశంతో ప్రధాని మోదీ 'నషా ముక్త్ భారత్' కోసం పనిచేయాలని నిర్ణయించారని ఆయన వివరించారు. డ్రగ్స్ వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని అన్నారు.2029 నాటికి దేశాన్ని మత్తుపదార్థాలు లేని సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మహమ్మారిపై సాగే పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రకు సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్‌లతో పాటు పలువురు క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు ఇప్పటికే తమ పూర్తి మద్దతు ప్రకటించినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా గ్లోబల్ సమ్మిట్



మొదటిపేజీ తరువాయి - 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక నిర్మాణం, ఎక్స్‌పో జోన్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, అతిథుల వసతి తదితర అంశాలపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగేలా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక సామర్థ్యాన్ని చాటిచెప్పేందుకు ఈ వేదిక అత్యంత కీలకమని పేర్కొన్నారు. పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సదస్సు జరగనుంది. ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా సుమారు 1,500 మందికి పైగా సీఈవోలు, పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు హాజరుకానున్నారు. అలాగే డిఫెన్స్, ఫార్మా, గేమింగ్, ఏఐ వంటి కీలక రంగాల నుంచి 1,000 కంటే ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా మల్టీ సెక్టార్ ఎక్స్‌పోను కూడా ఏర్పాటు చేస్తున్నారు.భద్రతా పరంగా ఫేషియల్ రికగ్నిషన్ వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది.

చేతులకు బేడీలు వేసే తీసుకొస్తాం

మొదటిపేజీ తరువాయి - ం

భారత్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ప్రత్యేక విమానం కావాలంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా చేసిన డిమాండ్‌పై ఢాకా ప్రభుత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆమె సాధారణ ప్రయాణికురాలు కాదని, కాళ్లకు చేతులకు బేడీలు వేసి కట్టుదిట్టమైన భద్రత నడుమ ఖైదీగా మాత్రమే దేశానికి తీసుకువస్తామని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ హెచ్చరించారు. డిసెంబర్ 16 'విజయ్ దివస్' సందర్భంగా ఢిల్లీ నుంచి బంగ్లాదేశ్ బిమాన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని పంపాలని హసీనా కోరడం ఒక పిచ్చితనం అంటూ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ చీఫ్ ప్రాసిక్యూటర్ ఎండీ అమీనుల్ ఇస్లాం కొట్టిపారేశారు. ఉరిశిక్ష పడిన ఓ నేరస్థురాలి కోసం ప్రభుత్వం సొంత విమానాన్ని పంపడం చరిత్రలో ఎన్నడూ జరగలేదని ఎద్దేవా చేశారు.కోరిక వేరు, వాస్తవం వేరంటూ ఢాకాలో విదేశీ దౌత్యవేత్తల సమావేశం అనంతరం కబీర్ విలేకరులతో మాట్లాడారు. హసీనా ఒక పారిపోయిన తీవ్రవాది అని, నేరగాళ్ల అప్పగింత ఒప్పందం ప్రకారమే ఆమె రాక సాధ్యమని తేల్చిచెప్పారు.మరోవైపు ప్రధాని సమాచార సలహాదారు జాహెద్ ఉర్ రెహమాన్ స్పందిస్తూ.. హసీనా రాకపై చర్చలు ఆమెతో కాదని, భారత్‌తో మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. ఆమె విమానంలో వస్తుందా? కాలినడకన వస్తుందా? అనేది కాదని, తీవ్రమైన నేరస్థురాలిని ఎలా అప్పగిస్తారనే అంశంపైనే భారత్‌తో సంప్రదింపులు జరుపుతామని వెల్లడించారు. హసీనా స్వయంగా రావాలనుకుంటున్నందున అప్పగింతకు న్యాయపరమైన అడ్డంకులు ఏవీ ఉండవని పేర్కొన్నారు.హసీనా రీఎంట్రీ ప్రకటనతో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న బాంబు దాడులు, హింసాకాండ వెనుక నిషేధిత అవామీ లీగ్ శక్తులు ఉన్నాయని ప్రభుత్వం ఆరోపించింది. ఇదే అంశంపై భారత్, అమెరికా, బ్రిటన్, చైనాతో సహా దాదాపు 60 దేశాల దౌత్యవేత్తలకు విదేశాంగ శాఖ సమగ్ర వివరాలు అందించింది. మరోవైపు ఎన్‌సీపీ నేత నహీద్ ఇస్లాం బంగ్లా ప్రధాని తారిక్ రెహమాన్‌తో భేటీ అయి, భారత్‌కు వ్యతిరేకంగా అన్ని పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. హసీనా లాంటి హంతకురాలికి ఆశ్రయం ఇస్తున్నందుకు నిరసనగా భారత పెత్తనాన్ని ప్రతిఘటించాలని ఆయన వ్యాఖ్యానించారు.



చివరి దశకు గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులు

గంటన్నర సమయం ఆదా

గుంటూరు-గుంతకల్లు మధ్య రెండో రైలు మార్గం పనులు చివరి దశకు చేరుకున్నాయి

401 కి.మీ. మేర డబ్లింగ్, విద్యుద్దీకరణకు రూ.3,631 కోట్లు వెచ్చించేలా కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది



గుంటూరు-గుంతకల్లు మధ్య రెండవ రైల్వే లైను నిర్మాణం తుది దశకు చేరుకుంది. 401 కిలోమీటర్ల ఈ మార్గంలో డబ్లింగ్ (రెండు లైన్ల నిర్మాణం) విద్యుద్దీకరణ పనుల కో

పశుగ్రాస సాగుకు ప్రభుత్వం పెద్దపీట

ఎకరాకు రూ.69 వేల ఉచిత ఆర్థిక సహాయం.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మొలకతాల గ్రామంలో రైతులకు అవగాహన కల్పించిన డాక్టర్ భారతి



పెద్దవడుగూరు, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ వాతావరణ మార్పులు, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో పశువులకు పచ్చిమేత కొరత ఏర్పడకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని గుత్తి పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ భారతి సూచించారు. ఇందులో భాగంగా మంగళవారం పెద్దవడుగూరు మండలంలోని మొలకతాల గ్రామాన్ని సందర్శించి రైతులకు బహువార్షిక పశుగ్రాస పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశువులకు నిరంతరంగా పచ్చిమేత అందుబాటులో ఉండేలా రైతులు ప్రణాళికాబద్ధంగా పశుగ్రాస పంటలను సాగు చేయాలని తెలిపారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బహువార్షిక పశుగ్రాస పంటల పెంపకానికి ప్రభుత్వం ఒక ఎకరాకు రూ.69 వేల ఆర్థిక సహాయాన్ని ఉచితంగా అందిస్తోందని వెల్లడించారు. రైతులు తమ పొలాల్లో పశుగ్రాస పంటలను సాగు చేసుకోవడం ద్వారా పశువులకు ఏడాది పొడవునా పచ్చిమేత అందించవచ్చని పేర్కొన్నారు. పచ్చిమేత లభ్యత పెరిగితే పశువుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పాల ఉత్పత్తికి కూడా దోహదపడుతుందని తెలిపారు. పశువుల పెంపకంపై ఆధారపడిన రైతులు పశుగ్రాస సాగును ఒక ముఖ్యమైన వ్యవసాయ అనుబంధ కార్యక్రమంగా గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన చిన్న, సన్నకారు రైతులు వినియోగించుకొని బహువార్షిక పశుగ్రాస సాగు చేపట్టాలని డాక్టర్ భారతి కోరారు. పశుగ్రాస కొరతను ముందుగానే నివారించుకోవడానికి రైతులు ఈ పథకంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయంలో దీపోత్సవం

దీపాల వెలుగుల్లో శివాలయం.. భక్తిశ్రద్ధలతో దీపారాధన



పెద్దవడుగూరు, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దవడుగూరు మండలంలోని శివాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా దీపాల కాంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

మహిళలపై హింస నిర్మూలనకు అవగాహన కార్యక్రమం

80 జంటలతో ఆర్.డి.టి. ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం



రాయదుర్గం, నవంబర్ 24 అక్షర మేధస్సు మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టి, స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించాలనే లక్ష్యంతో రాయదుర్గం మండలం 74 ఉడేగోళంలోని ఆర్.డి.టి. ఫీల్డ్ కార్యాలయంలో మంగళవారం స్త్రీలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుమ్మగట్టు మండలానికి చెందిన సుమారు 80 జంటలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మహిళలు, బాలికలు కుటుంబంలోనూ, సమాజంలోనూ ఎదుర్కొంటున్న మానసిక, శారీరక, లైంగిక వేధింపులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై హింసను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజంలో నిజమైన స్త్రీ పురుష సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా భార్యాభర్తలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. లీడర్ల ద్వారా మహిళా హక్కులు, సమానత్వంపై అవగాహన కల్పించడంతో పాటు వీడియో ప్రదర్శనల ద్వారా హింసకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కుటుంబాల్లో పరస్పర గౌరవం, అవగాహన, సహకారం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఆర్.డి.టి. ఏపీసీ సుకన్య, ఇందిర ప్రసన్న, ఆర్.డి.టి. సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ



పెద్దవడుగూరు, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి ఊపందుకుంటున్న నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియ సోమవారం ఆరు గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఈ పరిశీలనలో వివిధ కారణాలతో తొమ్మిది మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురైనట్లు ఎంపీడీఓ బారెన్ సాహెబ్ వెల్లడించారు. రావులుడికి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు రంగేశ్వరరెడ్డి దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. అదేవిధంగా గుత్తి అనంతపురం గ్రామంలో ఏడుగురు, బుర్రాకుంట గ్రామంలో ఒకరి నామినేషన్ పత్రాలను అధికారులు తిరస్కరించినట్లు తెలిపారు. మొత్తం తొమ్మిది మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఎంపీడీఓ స్పష్టం చేశారు. మండలంలోని గ్రామాల్లో ఎన్నికల వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. రావులుడికి గ్రామంతో పాటు మరో 21 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం దిశగా కొనసాగుతున్నాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం అభ్యర్థుల బలాబలాలు, రాజకీయ సమీకరణాలపై ఆయా గ్రామాల్లో చర్చలు జోరందుకున్నాయి. ఇదిలా ఉండగా లక్ష్మంపల్లి, అప్పెచెర్ల, తిమ్మాపురం గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ నెలకొంది. అప్పెచెర్లలో తెలుగుదేశం పార్టీ మద్దతుదారుల మధ్యే పోటీ ఉండటంతో రాజకీయంగా ఆసక్తికర పరిస్థితి ఏర్పడింది. ఒకే పార్టీకి చెందిన మద్దతుదారులు బరిలో నిలవడంతో గ్రామంలో ఎన్నికల పోరు ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. నామినేషన్ల పరిశీలనతో ఎన్నికల తొలి ఘట్టం కీలక దశకు చేరుకోగా, తదుపరి పరిణామాలపై గ్రామాల్లో రాజకీయ వర్గాలు, అభ్యర్థులు దృష్టి సారించారు. ఏకగ్రీవంగా నిలిచే గ్రామాలు ఎన్ని? పోటీ జరిగే గ్రామాలు ఎన్ని? అన్న అంశాలపై స్థానికంగా ఉత్కంఠ కొనసాగుతోంది.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారుల మూడవ దశ ర్యాండమైజేషన్ పూర్తి



అనంతపురం, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి జిల్లాలో జరిగే గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహణకు పోలింగ్ అధికారుల మూడవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని ఎస్ఐసి హాలులో అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, ఐ.ఏ.ఎస్ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ.... జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు 2,865 మంది, ఓపిఓలు 2,865 మందిని, ఓపిఓ1లు 1,734, ఓపిఓ2లు 232 మంది పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు కేటాయించి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. పకడ్బందీగా పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, ఎన్ఐసి డిఐఓ భారతి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, తదితరులు పాల్గొన్నారు.

రిగ్గింగ్ చేసినా.. ఓడిపోయిన చరిత్ర మీది

దుష్ప్రచారం చేయడం తగదు

జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు తగవు

అనంత వెంకట్రామిరెడ్డి హయంలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలుసుకొని మాట్లాడండి..

గెలుపోటములు సహజం.. ప్రజల తీర్పును శిరసావహిస్తాం

బీజేపీ నేతలు ఓటమిని జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారు

మీడియాతో నగర మేయర్ సి.రమేష్ గౌడ్



అనంతపురం, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి

రిగ్గింగ్ చేసినాఓడిపోయినటువంటి చరిత్ర కూటమి ప్రభుత్వానిది. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి నానా తంటాలు పడుతూ ఆస్కార్ అవార్డు మాదిరిగా ఊగిపోతూ, తూలిపోతూ, ఆవేశపడుతూ బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని నగర మేయర్ సి.రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి హయాంలో అనంతపురం నగరం ఎంత అభివృద్ధి చెందిందో ఓసారి గుర్తుచుకోవాలన్నారు. ఒక జిల్లా అధ్యక్ష పదవిలో ఉండి నాలుగు సార్లు ఎంపీ అయిన అనంత వెంకటరామిరెడ్డిని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పట్టుకుని లుచ్చా, లోఫర్ అంటారా? ప్రజల అభిప్రాయాన్ని గౌరవించలేని విధంగా నువ్వు మాట్లాడే ప్రతి మాట యావత్ అనంతపురం జిల్లా బీజేపీ నాయకత్వం అంతా మాట్లాడినట్టే కదా?. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడిన కొనుకొండ్ల రాజేష్.. పోలింగ్ బూత్‌లోకి దూరి డోర్లు వేసి లోపల వ్యక్తులను పెట్టి రిగ్గింగ్ జరిపిస్తూ బయట కాపలాదారుడిగా ఉన్నది నిజం కాదా? అనంతపురంలో ఉదయం 7 గంటలకే ఒక ఓటు వేసి, మళ్లీ కూడేరు మండలం కదదరకుంట గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల్లో మరో ఓటు వేస్తావా? సిగ్గు లేదా? కొనకొండ్ల రాజేష్.. అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు, మంత్రులు బూత్‌లలోకి వెళ్లి దాడులు చేయించారు. నా సహచరుల మోకాళ్లు, కాళ్లు, చేతులు విరిగి, తలలు పగిలి ఇప్పటికీ హాస్పిటల్‌లో ఉన్నారు. కౌంటింగ్ రోజు మాకు మెజారిటీ వస్తుంటే ఓర్చుకోలేక నాలుగు టేబుళ్ల కౌంటింగ్ ప్రక్రియను ఆపేసి తెల్లవారుజామున ఐదు గంటల వరకు అధికారులకు, మాకు, ఏజెంట్లకు నరకం చూపించారన్నారు. ఆ రిగ్గింగులే జరగకపోయి ఉంటే, ఆ బూత్ క్యాప్చర్లు జరగకపోయి ఉంటే, కౌంటింగ్‌లో ఉన్న ఇన్‌వాలిడ్ ఓట్లు ఎక్కువ మావి తీసేయకపోయి ఉంటే 35వేలకు పైచిలుకు మెజారిటీ మాకు వచ్చేదన్నారు. కౌంటింగ్ రోజు 10వేల మందికి పైగా ప్రజలు స్వచ్ఛందంగా రోడ్ల మీదకు రావడమే ప్రజల అభిప్రాయానికి నిదర్శనమన్నారు. ఓటమిని అంగీకరిస్తున్నామని మంత్రి సత్య కుమార్ ట్వీట్ చేసి, వైసీపీ అభ్యర్థికి కూడా శుభాకాంక్షలు తెలియజేసిన 10రోజుల తర్వాత ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారు కోర్టుకు వెళ్తే బాగోతాలన్నీ, దౌర్జన్యాలన్నీ, సీసీ ఫుటేజీలు బయటకు వచ్చి మాకు ఇంకా ఎక్కువ న్యాయం జరుగుతుందని, ఇంకా ఎక్కువ మెజారిటీ తమకే వస్తుందన్నారు. గెలిచినా గర్వం ఉండకూడదని, ప్రజలకు అందుబాటులో ఉండి కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అందరినీ కలుపుకొని మంచి పనులు చేయాలని మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి చెప్పారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షానే ఎళ్లప్పుడూ ఉంటుందన్నారు. కేంద్రంలో మేమే, రాష్ట్రంలో మేమే అని విర్రవీగారు కదా.. ఈరోజు రండి, కలిసి పనిచేద్దాం. మీ మేనిఫెస్టోలో చెప్పిన విమానాశ్రయం తీసుకురండి, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ తీసుకురండి, రైల్వే జంక్షన్ తీసుకురండి, మొన్న మదనపల్లిలో ప్రారంభించినట్లు హార్టీకల్చర్ హబ్‌ను ఇక్కడికి తీసుకురండి అని నగర అభివృద్ధికి అందరం కలిసి పని చేద్దామన్నారు. అలాగే పెద్దాయన జేసీ ప్రభాకర్‌రెడ్డి యువతను ప్రోత్సహిస్తూ, అధికారులను సహకరించమని చెప్తారని ఆశించాం.. కానీ ఆయన అలా మాట్లాడలేదు. పార్టీ మారమని ఆయన చెప్పినట్లు అట్లా పార్టీలు మారుకుంటూ పోతా ఉంటే ఇంకా ఒకటే పార్టీ మిగులుతుంది అంతే. ఇంకా ఏం పార్టీలు ఉండవన్నారు. ప్రజల అభిప్రాయాన్ని ఏ ఒక్కరైనా కచ్చితంగా గౌరవించి తీరాల్సిందే. అధికారులు సహకరించకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో మాకంటూ కొన్ని మార్గాలు ఉంటాయి.. అవి చేసి చూపిస్తాం. అనంతపురం నగర అభివృద్ధి కోసం కచ్చితంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మేయర్ సి.రమేష్ గౌడ్ స్పష్టం చేశారు.

జపాన్ ప్రతిష్ఠాత్మక సాకురా సైన్స్ ప్రోగ్రామ్‌కు పాతదేవరపల్లి వాసి డా. ఆరేటి శివయ్య ఎంపిక

ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ.. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

పూర్వ విద్యార్థికి అంతర్జాతీయ గుర్తింపు







శ్రీ సత్యసాయి, నవంబర్ 24, అక్షర మేధస్సు ప్రతినిధి శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం పాతదేవరపల్లి గ్రామానికి చెందిన డా. ఆరేటి శివయ్య అరుదైన అంతర్జాతీయ పరిశోధనా అవకాశాన్ని దక్కించుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో ఉన్న సర్దార్ వల్లభభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రసాయన శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన, తన పరిశోధనా బృందంతో కలిసి జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక సాకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ 2026కు ఎంపికయ్యారు. డా. ఆరేటి శివయ్య శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురంలోని రసాయన శాస్త్ర విభాగంలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ఐఐటీ బాంబేలో ప్రొఫెసర్ సి. పుల్లారావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రస్తుతం సూరత్‌లోని లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ పరిశోధనా రంగంలో తన ప్రతిభను చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2026 నవంబర్ 26 నుంచి డిసెంబర్ 16 వరకు 21 రోజుల పాటు జపాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సుకుబాలో రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ యోషినోబు నిషిమురా పర్యవేక్షణలో ఉన్నతస్థాయి పరిశోధనలు చేపట్టనున్నారు. ఫ్లోరోసెన్స్ ప్రోబ్స్ రూపకల్పన, సంశ్లేషణ, బయోఇమేజింగ్ అప్లికేషన్లు, వ్యాధుల గుర్తింపు, నిర్ధారణ వంటి ఆధునిక పరిశోధనా అంశాలపై పనిచేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపికైన పరిశోధకులకు విమాన ప్రయాణం, స్థానిక రవాణా, వసతి, భోజనం తదితర ఖర్చులను జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ భరిస్తుంది. భారత్, జపాన్ దేశాల మధ్య శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనా సహకారాన్ని పెంపొందించడంతో పాటు యువ శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ పరిశోధనా అనుభవాన్ని అందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, ఐఐటీ బాంబే వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించి, నేడు జపాన్ అంతర్జాతీయ పరిశోధనా వేదికపై అవకాశం దక్కించుకోవడం పట్ల పాతదేవరపల్లి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డా. ఆరేటి శివయ్య మరిన్ని పరిశోధనా విజయాలు సాధించి దేశానికి, తన స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

చెత్తను పంచాయతీ వాహనాల్లోనే వేయాలి

గ్రామ పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే ప్రజారోగ్యానికి ముప్పు



పెద్దవడుగూరు నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త సేకరణ వాహనాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, పెద్దవడుగూరు పంచాయతీ కార్యదర్శి డి. ఆంజనేయులు అన్నారు ఇంటి నుంచి వెలువడే చెత్తను వాటిలోనే వేయాలని సూచిస్తున్నారు. రోడ్లపై, వీధుల్లో, మురుగు కాలువల్లో చెత్త వేయడం వల్ల గ్రామ పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా ప్రజారోగ్యానికి కూడా ముప్పు ఏర్పడుతోంది. అని ప్రతిరోజూ ఇళ్లలో ఆహార పదార్థాల వ్యర్థాలు, కూరగాయల తొక్కలు, ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు తదితర చెత్త ఉత్పత్తి అవుతుంది. వీటిని సరైన పద్ధతిలో పారవేయకుండా బహిరంగ ప్రదేశాల్లో వేయడం వల్ల దుర్వాసన వ్యాపిస్తుంది. వర్షాకాలంలో చెత్త పేరుకుపోవడం వల్ల నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెంది అవకాశం ఉంది. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది.

ఇంటి నుంచే పరిశుభ్రత ప్రారంభం కావాలి

ప్రతి కుటుంబం తమ ఇంట్లోనే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు చేసుకోవాలి. పంచాయతీ చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు చెత్తను సిబ్బందికి అందించాలి. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో, మురుగు కాలువల్లో చెత్త వేయడం వల్ల ఇతర కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన గ్రామం

గ్రామ పారిశుద్ధ్యం విషయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు సమన్వయంతో పనిచేయాలి. కేవలం పంచాయతీ సిబ్బంది మాత్రమే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచలేరని, ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని గుర్తించాలి. చెత్తను సక్రమంగా పారవేయడం, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత.పెద్దవడుగూరు మండల ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ వాహనాల్లోనే వేయాలని, గ్రామ వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరుతున్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఇంటి నుంచి పరిశుభ్రతకు శ్రీకారం చుట్టాల ని పంచాయతీ కార్యదర్శి డి ఆంజనేయులు బిల్ కలెక్టర్ జయరాముడు

ఈవెనింగ్, నైట్ కోర్టుల ప్రతిపాదనను వెనక్కి

గుంతకల్లులో న్యాయవాదుల ఆందోళన.. కోర్టు విధుల బహిష్కరణ

కక్షిదారులు, న్యాయవాదుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన



గుంతకల్లు, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పైలట్ ప్రాజెక్టు కింద ఆంధ్రప్రదేశ్‌లో ఈవెనింగ్ కోర్టులు, నైట్ కోర్టులు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గుంతకల్లు న్యాయవాదులు నిరసన బాట పట్టారు. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ గుంతకల్లు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. నవంబర్ 24 నుంచి 26వ తేదీ వరకు విధులకు హాజరుకాకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయస్థానాల పనివేళల్లో మార్పులు తీసుకురావడం వల్ల న్యాయవాదులతో పాటు కక్షిదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. సాధారణంగా కోర్టు పనివేళల్లోనే అనేక సమస్యలతో న్యాయస్థానాలకు వచ్చే కక్షిదారులకు సాయంత్రం, రాత్రి వేళల్లో కోర్టు విచారణలు నిర్వహించడం మరింత భారంగా మారుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి కేసుల నిమిత్తం గుంతకల్లుకు వచ్చే కక్షిదారులు సాయంత్రం లేదా రాత్రి వేళల్లో విచారణకు హాజరై తిరిగి తమ గ్రామాలకు వెళ్లడం కష్టతరమవుతుందని వివరించారు. రవాణా సౌకర్యాలు, భద్రతా పరమైన సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులు సైతం రోజంతా కోర్టు విధులు నిర్వహించిన అనంతరం రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించడం వల్ల వ్యక్తిగత, కుటుంబ జీవితంపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.న్యాయవ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటే కక్షిదారుల సౌకర్యం, న్యాయవాదుల అభిప్రాయాలు, భద్రతా అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు. ఈవెనింగ్, నైట్ కోర్టుల ఏర్పాటు ప్రతిపాదనపై పునరాలోచన చేయాలని, న్యాయవాదుల అభ్యంతరాలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గుంతకల్లు అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. జయరాం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బి. తిమ్మప్ప, సీనియర్ న్యాయవాదులు బి. సత్యనారాయణ, సి. వెంకటేశులు, తిమ్మారెడ్డి, భాస్కర్ గౌడ్, బడే సాబు, గోపాల్ కృష్ణ, సురేష్, ధనుంజయ, రవికిరణ్, లక్ష్మీనారాయణ, రవీంద్రకుమార్, తాజుద్దీన్, ప్రసాద్, మోహన, టి. సురేష్, ఎస్. బాను, వరప్రసాద్, రమేష్, మేరీ, చంద్రశేఖర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

బండారు సుబ్బన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం

వర్ధంతిని సేవా కార్యక్రమంతో స్మరించుకున్న కుటుంబ సభ్యులు

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు భోజన పంపిణీ



బుక్కరాయసముద్రం , నవంబర్ 24 అక్షర మేధస్సు

దివంగతుల జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం చేయడం ద్వారా మానవతా విలువలను చాటుకోవచ్చని నిరూపిస్తూ బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన బండారు సుబ్బన్న కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. సుబ్బన్న ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం వచ్చిన రోగుల సహాయకులు, నిరుపేదలకు భోజనాన్ని పంపిణీ చేశారు. ఆసుపత్రుల వద్ద రోగుల వెంట ఉండే కుటుంబ సభ్యులు భోజన సదుపాయం కోసం ఇబ్బందులు పడుతుంటారని గుర్తించి, వారికి కొంతైనా సహాయం అందించాలనే మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బండారు సుబ్బన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అన్నదానం నిర్వహించడం పలువురి అభినందనలు అందుకుంది. వర్ధంతి కార్యక్రమాలను కేవలం పూలమాలలు, నివాళులకే పరిమితం చేయకుండా పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టడం ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బండారు సుబ్బన్నకు బండారు కొండ రాయుడు మరియు కుటుంబ సభ్యులు, అభిమానులు ఆత్మీయ నివాళులు అర్పించారు. ఆయన జ్ఞాపకార్థం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు.

గ్రామ పంచాయతీల ఎన్నికల కోసం సన్నద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



అనంతపురం, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి అమరావతిలోని ఏపీ ఎలక్షన్ కమీషన్ కార్యాలయం నుంచి మంగళవారం 23 పట్టణ స్థానిక సంస్థలు మరియు ఫేజ్-1 గ్రామ పంచాయతీల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ లు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలెక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఐఏఎస్ (రిటైర్డ్) సమీక్ష నిర్వహించారు.అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, డిపిఓ నాగరాజునాయుడు, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ సమత పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డిపిఓతో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడారు. జిల్లాలో గ్రామ పంచాయతీల ఎన్నికల కోసం సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. మొదటి దశ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కోసం మెటీరియల్, వాహనాల ఏర్పాటు, పోలింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజేషన్, శిక్షణ, సిసిటివిల ఏర్పాటు, తదితర అన్ని రకాల అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఏ సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు.

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..



అనంతపురం, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని, ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్డిసి ఆనంద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి.

డిసెంబర్ నెలలో చేపట్టాల్సిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియపై అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్





పుట్టపర్తి నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు సాయంత్రం జిల్లాలోని రెవెన్యూ మరియు సర్వే విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...

సంబంధిత అధికారులందరూ రీసర్వే మరియు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నేటి వీడియో కాన్ఫరెన్స్‌లో భూపరిపాలన ప్రధాన కమిషనర్ (జజూూ) జారీ చేసిన సూచనలు, ఆదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి తూచా తప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌డిసి విజయ కుమారి,రీసర్వే ఎడి విజయ శాంతి బాయి జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు,తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు మరియు మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

సముద్రంలో ఏడుగురు మత్స్యకారుల గల్లంతు.. గాలింపు చర్యలను ముమ్మరం చేయండి: సీఎం చంద్రబాబు ఆదేశం

వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు

తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన చంద్రబాబు

కోస్ట్‌గార్డ్ నౌకలు నేవీ హెలికాప్టర్‌తో ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు

కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రంగంలోకి దిగాలన్న వైఎస్ జగన్



కాకినాడ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారిని గుర్తించేందుకు సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తూ ధైర్యం చెప్పాలని అధికారులకు స్పష్టం చేశారు. ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 4వ తేదీన మోటరైజ్డ్ బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. నవంబర్ 10న విశాఖపట్నం హార్బర్‌కు చేరుకుని వేటలో పడిన చేపలను విక్రయించిన అనంతరం తిరిగి సముద్రంలోకి ప్రయాణమయ్యారు. నవంబర్ 14 వరకు వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. ఆ తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదు. అయితే నవంబర్ 18న ఒడిశాలోని పారాదీప్ పోర్టు సమీపంలో వీరి బోటు ఉన్నట్లు గుర్తించినప్పటికీ, నవంబర్ 19 నుంచి పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. బోటులోని ఏడుగురు మత్స్యకారుల మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయని, బోటుకు అమర్చిన జీపీఎస్ ట్రాన్స్‌పాండర్ ఆన్ చేయకపోవడం వల్ల శాటిలైట్ లేదా జీపీఎస్ ద్వారా కూడా ఆచూకీ గుర్తించడం సాధ్యం కాలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారులు భారత కోస్ట్‌గార్డ్ సహాయాన్ని కోరారు. ప్రస్తుతం కోస్ట్‌గార్డ్ నౌకలు, భారత నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లతో పారాదీప్ తీర ప్రాంతంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాకినాడ, చెన్నై, ఒడిశా కోస్ట్‌గార్డ్ స్టేషన్లను సమన్వయం చేయడంతో పాటు, సముద్ర సరిహద్దుల దృష్ట్యా బంగ్లాదేశ్, మయన్మార్ కోస్ట్‌గార్డ్‌లను కూడా అప్రమత్తం చేశారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. మెరైన్ పోలీస్, కోస్ట్‌గార్డ్, నేవీ దళాలతో సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని, కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. మరోవైపు మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్ అధికారులు బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి ధైర్యం చెప్పారు.

వారసత్వ వారధి తరాల మధ్య జ్ఞాన గోష్టి

అనంతపురం, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు ఐఏఎస్ మరియు అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఐఏఎస్ గారి నేతృత్వంలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2026 లో భాగంగా ఈరోజు అనగా 24-11-2026 "వారసత్వ వారధి - తరాల మధ్య జ్ఞాన గోష్టి ", అనే కార్యక్రమము పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాల వద్ద ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం రాష్ట్ర పురావస్తు మరి ప్రదర్శనశాల శాఖ అనంతపురం మరియు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (×చీూజఎ) వారి ఆధ్వర్యంలో జరిగింది. ఎఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ సహాయ సంచాలకులు యం.స్వామి నాయక్, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (×చీూజఎ)కో కన్వీనర్ పి.కృష్ణమూర్తి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మల్లేశ్వరి, శ్యామసుందర శాస్త్రి, ప్రొఫెసర్ జిఎల్ఎన్ ప్రసాద్, చంద్ర శేఖర రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీమతి పద్మనారాయణారెడ్డి మాట్లాడుతూ ఆదర్శవంతమైన యువత, నేటి సమాజానికి చాలా అవసరమని, యువతరం మానసికంగానూ, శారీరకంగానూ మరియు మేధో పరిపక్వతతో ఉండాలని, సంస్కృతి వారసత్వం అంటే కేవలము అవి పుస్తకాల్లో చదివే విధంగా ఉండకూడదని, మన నిత్యజీవితంలో వాటిని భాగం చేసుకుంటూ మలుచుకోవాలని, నైతిక విలువలకు



ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ూాదీచీ కళాశాల, ఖూ= మరియు ూాజజు పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొని, విద్యార్థులు తమ భవిష్యత్తుకు, నేటి సామాజిక జీవనానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన ప్రశ్నలను సంధించారు. కుటుంబ సభ్యులతో ఎలా మెలగాలి, కుటుంబ బంధాలను ఎలా గౌరవించాలి, చదువులో ఉన్నతంగా ఎలా రాణించాలి, ఆరోగ్య పరిరక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎలా ఎదగాలి, మన సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను కాపాడటంలో యువత ఎలాంటి పాత్ర పోషించాలి, వంటి ప్రశ్నలతో తమ ఆలోచనలను, సందేహాలను పెద్దల ముందుంచారు. విద్యార్థులు అడిగిన ప్రతి ప్రశ్నకు కార్యక్రమంలో పాల్గొన్న అనుభవజ్ఞులు ఎంతో ఓపికగా, బాధ్యతాయుతంగా, క్షుణ్ణంగా సమాధానాలు అందిస్తూ, తమ జీవితానుభవాల నుంచి నేర్చుకున్న విలువైన పాఠాలను వివరించారు. ఈ కార్యక్రమం పెద్దతరానికి, యువతరానికి మధ్య అనుభవాల అనుసంధాన వేదికగా నిలిచింది. సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న అనుభవజ్ఞులు, ప్రముఖులు విద్యార్థులతో ముఖాముఖి సంభాషిస్తూ జీవిత విలువలు, కుటుంబ బంధాలు, విద్య, ఆరోగ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ పరిరక్షణ వంటి కీలక అంశాలపై తమ అమూల్యమైన అనుభవాలను పంచుకున్నారు.ఈ జ్ఞాన గోష్టి విద్యార్థులకు కేవలం సమాచారాన్ని అందించే కార్యక్రమంగానే కాకుండా, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి దోహదపడే స్ఫూర్తిదాయక వేదికగా నిలిచింది. పుస్తకాల్లో లభించే విజ్ఞానంతో పాటు పెద్దల అనుభవాల్లో దాగి ఉన్న జీవిత పాఠాలు కూడా భావితరాల ఎదుగుదలకు ఎంతో అవసరమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఒక తరం అనుభవం మరో తరానికి మార్గదర్శకం కావాలి, మన సంస్కృతి-- సంప్రదాయాల పట్ల యువతలో బాధ్యతాభావం పెంపొందాలి, వారసత్వ సంపద భావితరాలకు భద్రంగా అందాలి అనే సందేశంతో కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మురళీకృష్ణ, రియాజుద్దీన్, జూటూరు షరీఫ్, సూర్య ప్రకాష్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పై ప్రతినిధులందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించడమైనది.

ఓటర్ల జాబితా స్వచ్ఛంగా మరియు పారదర్శకంగా ఉండేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



అనంతపురం, నవంబర్ 24 అక్షర మేధస్సు ప్రతినిధి ఓటర్ల జాబితా స్వచ్ఛంగా మరియు పారదర్శకంగా ఉండేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) - 2026పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష సమావేశంనిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా రీ-వెరిఫికేషన్ అబ్సెంట్, షిప్టెడ్, డెడ్ లేదా డూప్లికేట్ (ూూణణ) లిస్ట్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, ఇంటింటి సర్వే మరియు క్షేత్రస్థాయి పరిశీలన అంశాలపై చర్చించారు. ఓటర్ల జాబితా రీ-వెరిఫికేషన్ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా పాల్గొని, ఓటర్ల జాబితా స్వచ్ఛంగా మరియు పారదర్శకంగా ఉండేలా సహకరించాలని సూచించారు. అలాగే నిన్నటి వరకు అందిన జాబితాలు, వాటి స్థితిగతులు మరియు తదుపరి చేపట్టబోయే చర్యల వివరాలను తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా నోటీసు దశ / క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం 2026 డిసెంబర్ 15 తేదీ వరకు పొడిగించినట్లు చీఫ్ ఎలెక్టోరల్ అధికారి వారి ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ తెలిపారు. అలాగే గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని 2026 డిసెంబర్ 22వ తేదీకి రీ-షెడ్యూల్ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారుఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అమరనాథ్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి నారాయణ స్వామి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఇమామ్, జనసేన పార్టీ ప్రతినిధి కిరణ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్ వలీ, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ఈశ్వర ప్రసాద్ పాల్, తదితరులు పాల్గొన్నారు

దొంగ దెబ్బ తీస్తున్న డెంగీ ఈ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దంటున్న వైద్యులు

తెలంగాణలో డెంగీ, ఇన్‌ఫ్లూయెంజా కేసులు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో దోమల నియంత్రణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.డెంగీ జ్వరం దొంగ దెబ్బ తీస్తోంది. వాతావరణ మార్పులతో ఇన్‌ఫ్లూయింజా ఎ, బి కేసులు వ్యాపిస్తున్నాయి. కొందరిలో వీటితో పాటు డెంగీ కలిసి దాడి చేస్తోంది. డెంగీ, ఇన్‌ఫ్లూయింజా లక్షణాలు ఒకేలా ఉండటంతో రోగులు 48 నుంచి 72 గంటల వరకు ఆసుపత్రికి రావడానికి ఆలస్యం చేస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఫలితంగా వారి ప్లేట్‌లెట్లు పడిపోవడం, తీవ్రమైన అలసట, రక్తస్రావం, శ్వాసకోశ సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నారని అంటున్నారు.ఈ సీజన్‌లో డెంగీ సాధారణ లక్షణాలకు భిన్నంగా (ఎటిపికల్ డెంగీ) కనిపిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కామినేని కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీకృష్ణ రాఘవేంద్ర బొడ్డు అన్నారు. వాస్తవానికి శీతాకాలంలో దోమల వ్యాప్తి తగ్గడంతో డెంగీ కేసులు కూడా తగ్గుతాయి. హైదరాబాద్ నగరంలో చలి పెరుగుతున్నప్పటికీ డెంగీ కేసులు తగ్గడం లేదని ఆయన అన్నారు.ఒక ప్రైవేట్ ఉద్యోగి మూడు రోజులుగా తేలిక పాటి జ్వరం, దగ్గు, జలుబు, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఇది సాధారణ ఫ్లూ అనుకుని ఇంట్లోనే ఉండి చికిత్స తీసుకున్నాడు. నాలుగో రోజు మరింత నీరసంగా మారడంతో వైద్యుడిని సంప్రదించాడు. రక్త పరీక్షలు చేయగా, ప్లేట్‌లెట్లు గణనీయంగా పడిపోయాయి. వైద్యులు డెంగీగా నిర్ధారించారు.

హైదరాబాద్‌లో 500 కేసులు నమోదైనట్లు అంచనా

ప్రస్తుతం గ్రేటర్‌లో డెంగీ కేసులు అంత ఎక్కువగా లేవు. కానీ అవి అడపా దడపా నమోదవుతున్నాయి. ఈ లక్షణాలతో నెలకు 50 మంది వరకు నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో చేరుతున్నారు. ఇప్పటివరకు హైదరాబాద్‌లో 500 కేసులు నమోదైనట్లు అంచనా.



వైద్య, ఆరోగ్య శాఖ కచ్చితమైన సమాచారాన్ని విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.కేసుల సరళిని బట్టి దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. వర్షాలు లేకపోయినప్పటికీ తాగు నీరు, మురుగు నీటి లీకేజీలు, తెరిచి ఉన్న మురుగు కాలువల కారణంగా దోమల వ్యాప్తి పెరుగుతోంది. మూసీ పరివాహక ప్రాంతంలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వాటి మధ్య ఉన్న తేడాను గుర్తించాలి

హైదరాబాద్‌లో ప్రధానంగా ఇన్‌ఫ్లూయింజా టైప్ ఎ, బి రకాలు వ్యాపిస్తున్నాయి. టైప్ 'ఎ' వల్ల అకస్మాత్తుగా అధిక జ్వరం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, 2 నుంచి 3 వారాల పాటు పొడి దగ్గు ఉంటాయి. 'బి' టైప్‌లో పిల్లలు తీవ్రమైన కాలు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడతారు. ఇంట్లో ఒక వ్యక్తికి ఈ వ్యాధి సోకితే అది ఇతరులకు వ్యాపించవచ్చు. సాధారణ చికిత్సతో ఇది 3-4 రోజుల్లో తగ్గిపోతుంది. ఒకవేళ డెంగీ ఉంటే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో చేర్పించాలి.

పరిసరాల పరిశుభ్రతను పాటించండి

కృష్ణా డెల్టాకు నీటి కేటాయింపులు రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి వాడకంపై సోమవారం కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీలో ఏకాభిప్రాయం కుదరలేదు.

కేఆర్ఎంబీ సమావేశం



కృష్ణా డెల్టాకు నీటి విడుదల కోసం ఏపీ జలవనరుల శాఖ అధికారులు పట్టు పట్టడటం దానికి తెలంగాణ అధికారులు ససేమిరా అనడంతో సాగర్ నుంచి నీటి విడుదలపై ఏకాభిప్రాయం రాలేదు. మాకు ఇవ్వకుంటే మీరు తీసుకోవడం కుదరదని తెలంగాణకు ఏపీ అధికారులు చెప్పడంతో త్రిసభ్య కమిటీ భేటీలో నిర్ణయం తేలలేదు.నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి వాడకంపై సోమవారం కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీలో ఏకాభిప్రాయం కుదరలేదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎప్పటికప్పుడు నీటి అవసరాలపై చర్చించుకుని, పరిష్కరించుకునేందుకు త్రిసభ్య కమిటీ ఎప్పుడో ఏర్పాటైంది. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి కాంబోజు సతీశ్, ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్‌బాబు సోమవారం సమావేశమయ్యారు. వీరి మధ్య రెండు విడతలు చర్చలు జరిగినా ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేదు.కృష్ణా డెల్టాకు నీటి కేటాయింపులపై రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తడంతో సమావేశం ఫలవంతం కాలేదు. శ్రీశైలం నీటి వాడకంపై ఈ సమావేశంలో ఎలాంటి ప్రస్తావనా రాలేదు. నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 45 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. వచ్చే మూడు నెలల పాటు నీటి వాడకంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 6 టీఎంసీలు, నాగార్జునసాగర్ కాలువలకు 15 టీఎంసీలు అవసరమని తెలంగాణ కోరింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ కుడి కాలువ అవసరాలకు 8 టీఎంసీలు, ఎడమ కాలువకు సంబంధించి ఒక టీఎంసీ అడిగింది. కృష్ణా డెల్టా వ్యవస్థకు 10 టీఎంసీలు ఇవ్వాలని కోరింది.నీరు తీసుకునేందుకు వీలు లేదు : కృష్ణా డెల్టాకు నీరు తీసుకునేందుకు వీలు లేదని తెలంగాణ అధికారులు వాదించారు. పట్టిసీమ నుంచి నీరు తీసుకుంటున్నందున మరోవైపు పులిచింతలలో నీరున్నందున కృష్ణా డెల్టాకు ఎలా అడుగుతారనేది తెలంగాణ అధికారుల వాదన. పాత నీటిపారుదల వ్యవస్థలైన నెట్టెంపాడు, జూరాలలో వ్యవసాయం చేస్తూ అదే తరహాలో నిలిచే కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వబోమని ఎలా అంటారని ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి ప్రశ్నించారు.పట్టిసీమ నుంచి నీరు తీసుకొని మొత్తం కృష్ణా నది పరీవాహకంపైనే తాము ఒత్తిడి తగ్గించామని ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి చెప్పారు. కృష్ణా డెల్టా ఎప్పుడో పాత వ్యవస్థ అన్న గౌరవంతో అడిగిన కొద్దిపాటి నీరైనా ఇవ్వబోమంటే ఎలా అని నిలదీశారు. తాము 10 టీఎంసీలు అడిగామని, కనీసం 6 టీఎంసీలకైనా అంగీకరించాలని కోరారు. ఒకవేళ ఇప్పుడు ఇవ్వకున్నా ఫిబ్రవరిలో తీసుకునేందుకైనా అంగీకరించి, మినిట్స్‌లో నమోదు చేయాలని పట్టుపట్టారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు ఈ మధ్యే నీరు తీసుకున్నందున కొద్దికాలం ఆగి తీసుకోవాలని కూడా ఏపీ అధికారులు పేర్కొన్నారు.నాగార్జునసాగర్ కుడి కాలువకు 8 టీఎంసీలు ఎందుకని తెలంగాణ అధికారులు ప్రశ్నించారు. అక్కడ ఉన్న జనాభా ఎంత తాగునీటికి ఎంత నీరు అవసరమని అడిగారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. కృష్ణా డెల్టాకు నీరు తీసుకునేందుకు తెలంగాణ అధికారులు అంగీకరించకపోవడంతో అక్కడికి నీటి కేటాయింపులకు ఏపీ అంగీకరించలేదు. తుది నిర్ణయాలేవీ తీసుకోకుండానే సమావేశాన్ని ముగించారు.

Editor, Published & Owned By:N RANGANATH & Printed at M/S Achukatla Publications, # 9/1542, M.R.Road, Gooty R.S., Gooty - 515402, Ananthapuramu District. Andhra Pradesh. Published at # 1-3,Gajarampalli Village & Post, Pamidi Mandal, Pamidi - 515775 Ananthapuramu District. Andhra Pradesh. E-Mail:editorranganath@gmail.com
Cell: 8466071258 P.R.G.I. Regd. No:APTEL/26/A8343